క్లుప్తంగా...

ప్రత్యేక పూజలు


బాపునగర్‌లో పూజల్లో గడ్డి కుటుంబీకులు

లంగర్‌హౌస్: బుజిలీ మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపు వైభవంగా ఊరేగుతుంది. ఆలయ చైర్మన్ గడ్డి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో లంగర్‌హౌస్ బాపునగర్‌లో ఊరేగించారు. స్థానికులు అమ్మవారి ఊరేగింపునకు సాక సమర్పిస్తూ స్వాగతం పలికారు. పలువురు వారి గృహాల్లో అమ్మవారి ఘటానికి పూజలు నిర్వహించి ఒడిబియ్యం సమర్పించారు. గడ్డి కరణ్, నాగేంద్ర ప్రకాష్ రెడ్డి ఇళ్లలో పూజలు నిర్వహించగా మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, సంతోష్, ఇంద్రసేనారెడ్డి, రవికాంత్‌లు పూజల్లో పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ


మహిళలకు చీరలను అందజేస్తున్న పర్వతాల రాజేందర్

చాంద్రాయణగుట్ట: బోనాల ఉత్సవాల్లో భాగంగా జంగమ్మెట్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం తొలి బోనం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు, టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సాయి కిరణ్, ఉదయ్, అఖిల్, సదా మణిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ముత్యాల శేఖర్‌బాబు, సుమలత

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక మహంకాళికి అభిషేకం కమనీయంగా జరిగింది. బోనాల జాతరలో భాగంగా 6వ పూజ పురస్కరించుకొని శనివారం రాత్రి ఆలయ చైర్మన్ కొండేపుడి చంటి బాబు ఆధ్వర్యంలో సర్వేష్ పూజారి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. లంగర్‌హౌస్‌కు చెందిన సాయిటెక్ పెయింట్స్ నిర్వాహకులు ముత్యాల సుమలత, శేఖర్‌బాబు దంపతులు, సుమలత, ప్రగతి రిసార్ట్స్ నిర్వాహకులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి అభిషేకంలో పాల్గొన్నారు. ఈ పూజల్లో మాజీ చైర్మన్‌లు వసంత్‌రెడ్డి, అరవింద్, జగదీష్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా మహాయాగం


యాగంలో పాల్గొన్న గాజుల అంజయ్య తదితరులు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ఆదివారం రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం ఘనంగా నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ మహాయాగం 21 రోజుల పాటు కొనసాగనుంది. ఆదివారం జరిగిన యాగంలో ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


లలిత్ ప్రభా మహరాజ్‌ను కలిసిన మనిలాల్‌షా

అబిడ్స్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని జైన్ సమాజ్ ఆధ్యాత్మిక గురువు లలిత్ ప్రభా మహరాజ్ పేర్కొన్నారు. ఆదివారం నగరానికి వచ్చిన ఆయనను టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా లలిత్ ప్రభా మహరాజ్ మాట్లాడుతూ..మనిషి ఆనందంగా ముందుకు పోయేందుకు ఆధ్యాత్మిక భావాలే అతి ముఖ్యమన్నారు.

వైభవంగా ఘట స్థాపన ఊరేగింపు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా బోనాలు

- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు
- ఊరేగింపులో పాల్గొన్న 22 ఆలయాలకు చెందిన ప్రధాన ఘటాలు


హరిబౌలి బంగారు మైసమ్మ ఘటంతో అనంతోజ్ హన్స్‌రాజ్, మల్యాల మధుసూదన్‌యాదవ్


సుల్తాన్‌షాహీ జగదాంబ ఘటంతో శశాంక్ తివారీ

చార్మినార్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి పాతబస్తీలో అమ్మవారి ఘట స్థాపన సామూహిక ఊరేగింపు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. అత్యధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు ఈ సామూహిక ఊరేగింపులోని అమ్మవారి ఘటాలకు స్వాగతం పలికారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, ఆచార వ్యవహారాలకు అద్దంపట్టేలా పాతబస్తీలో బోనాల ఉత్సవాలు ప్రతి ఏటా కనుల పండువగా జరుగుతాయి. నిజాం కాలం నుంచి ఇక్కడి అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన బోనంను సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలోనే ఈసారి కూడా పాతబస్తీలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం పాతబస్తీ శాలిబండ కాశీవిశ్వనాథ ఆలయం నుంచి ప్రారంభమైన అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపు కార్యక్రమం వైభవంగా కొనసాగింది. దారిపొడవునా కళాకారుల నృత్యాలు..పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పాతబస్తీలోని 22 ప్రధాన ఆలయాలకు చెందిన అమ్మవారి ఘటాలు ఈ ఊరేగింపులో పాల్గొన్నాయి. అమ్మవారి ఘటాల వెంట ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులున్నారు.

ఘటాలకు స్వాగతం పలికిన ప్రముఖులు..

లాల్‌దర్వాజా మోడ్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్‌తో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి తదితరులు అమ్మవారి ఘటాలకు స్వాగతం పలికారు.

పోలీసుల భారీ బందోబస్తు..

దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా ఆధ్వర్యంలో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు బందోబస్తును నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఊరేగింపు సందర్భంగా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించారు.

పాతబస్తీలో కలిసి మెలిసి ఉత్సవాలు...

పాతబస్తీలో ఉత్సవాలు కలిసి మెలిసి నిర్వహించుకోవడం నిజాం కాలం నుంచి వస్తుందని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, రాజ్యసభ సభ్యులు అనికుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో లాల్ దర్వాజ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక పై నుంచి వారు ఘటాలకు స్వాగతం పలికి ప్రసంగించారు.


గౌలిపురా మాతేశ్వరీ మాతకు స్వాగత పూజ చేస్తున్న లాల్‌దర్వాజా ఆలయ కమిటీ


మురాద్‌మహల్‌లోని మహంకాళి నల్ల పోచమ్మ ఘటం


ఉప్పుగూడ అమ్మవారి ఘటం ఊరేగింపులో ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్


గౌలిపురాలోని నల్లపోచమ్మ ఆలయం ఘటంతో కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేష్


ఘటాలకు స్వాగతం పలుకుతున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, గోపిశెట్టి రాఘవేందర్

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు


వేడుకల్లో తూంకుంట అరుణ్‌కుమార్, బొమ్మరాజు కృష్ణమూర్తి


వేడుకల్లో రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ నేత డాక్టర్ మెట్టు శ్రీకాంత్

అబిడ్స్: ఇమ్లిబన్ ధోబీఘాట్ రజక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో తెలంగాణ కురుమ యువత అధ్యక్షుడు తూంకుంట అరుణ్‌కుమార్, తెలంగాణ రజక ధోబీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొమ్మరాజు కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బుచ్చిరాజు, బొమ్మరాజు సతీష్, నర్సింహ, సాయిచరణ్, అరుణ్, మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మాన్‌గంజ్‌లో..

ఉస్మాన్‌గంజ్ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మెట్టు శ్రీకాంత్ బోనాల వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు.

కట్టమైసమ్మ ఆలయంలో..

జియాగూడ: జియాగూడ కట్టమైసమ్మ ఆలయంలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పరిసరాల బస్తీల వాసులు మాతేశ్వరీకి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ వేడుకల్లో జియాగూడ బీఆర్ఎస్ పార్టీ తరఫున మాతేశ్వరీకి బోనం సమర్పించారు. డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి, కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షులు మంగి కిషోర్‌కుమార్, శివ, నర్మద, అనిత, శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద..

గోల్కొండ: కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధి దేవర రాజేశ్వర్ అన్నారు. ఆదివారం దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద ఘటం ఊరేగింపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆలయ కమిటీ చైర్మన్ టి.అమర్ సింగ్ సలహాలు, సూచనల మేరకు బోనాలను భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తిశ్రద్ధలతో కార్వాన్ వీధుల్లో ఘటం ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో భిక్షపతి, ఉద్దడి జగదీష్, నర్సింగ్‌రావు, దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, శివా, మంగి కిషోర్ కుమార్


దర్బార్ మైసమ్మ ఘటం ఊరేగింపు దృశ్యం

గురువులను గౌరవించాలి


నాట్య గురువులను సత్కరిస్తున్న దామోదర్‌గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారతీయ సంస్కృతిలో గురువులకు మంచి స్థానం ఉందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ సంస్థ ఆధ్వర్యంలో గురుదేవో భవ పేరిట గురు పూర్ణిమ, తెలంగాణ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పూర్వం నుంచి కూడా గురువులకు మన సమాజంలో ఎంతో ప్రాధాన్యత ఉండేదని గుర్తు చేశారు. రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సతీమణి కాంతకుమారి మాట్లాడుతూ..గురువులను గౌరవించుకునే పరిస్థితి తిరిగి రావాలని ఆకాంక్షించారు. అంతకు ముందు వివిధ అంశాలపై చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. సెయింట్ జార్జ్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శోభా దేశ్‌పాండే, సంస్థ అధ్యక్షుడు లయన్ కెవి.రమణారావు, లలితరావు పాల్గొన్నారు.

'వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది'



గోల్కొండ: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ఐఏఎస్ అధికారి ఎస్.సంగీతసత్యనారాయణ అన్నారు. ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ ప్రదానోత్సవ కార్యక్రమం సందర్భంగా ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ మహ్మద్ మజ్హరుల్లాకు ఆయన కోర్సు పూర్తి చేసిన సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ వారు ఈ సర్టిఫికెట్ అందిస్తున్నారని ఒక ఏడాది లెర్నింగ్ ప్రొగ్రామ్ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ప్రశంసాపత్రాలతో పాటు సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. డిజైనింగ్ అండ్ మేనేజింగ్ ఎఫెక్టివ్ హెల్త్ కేర్ సిస్టమ్స్‌కు చెందిన ప్రొఫెసర్ సారంగ్‌దేవ్, ప్రొగ్రామ్ అధికారి నేహాసారంగి తదితరులున్నారు.

జూ పార్కులో వన మహోత్సవం


వన మహోత్సవంలో డాక్టర్ సువర్ణ

చార్మినార్: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్), డాక్టర్ సి. సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలు సింగ్ మేరు, ఇతర అటవీ అధికారులు, జూ పార్కుల డైరెక్టర్‌తో కలిసి నెహ్రూ జూలాజికల్ పార్క్ ను ఆదివారం సందర్శించారు. వన మహోత్స వం -2025లో భాగంగా వారంతా కలిసి జూ పార్కులో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సరీసృపాల నివాస ప్రాంతం సమీపంలో ఫికస్, ఇతర ఫలాలను ఇచ్చే చెట్ల మొక్కలు, నీడనిచ్చే చెట్ల మొక్కలను నాటడం ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ సువర్ణ జెండా ఊపి, చిన్న పిల్లల ఆవరణలో ప్రజా ప్రదర్శన కోసం ఒక జత 'సర్వల్ క్యాట్'ను విడుదల చేశారు. పీసీసీఎఫ్ పునరుద్ధరించిన శిలాజ ఉద్యానవనాన్ని కూడా ప్రారంభించారు. ఇది తెలంగాణ మ్యాప్ నమూనాలో నాటిన వివిధ రకాల మొక్కల జాతుల కలయిక. తెలంగాణ జూ పార్క్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమత్, మాజీ డైరెక్టర్ అక్బర్ (రిటైర్డ్) నెహ్రూ జూపార్క్ వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఏ. హకీం పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



జియాగూడ: సంజయ్‌నగర్ నల్లపోచమ్మ, తుల్జా భవాని ఉమ్మడి ఆలయాల్లో ఈ నెల 20న బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ప్రతినిధి రావుల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..విద్యుత్ దీపాల అలంకరణ, ప్రత్యేక పుష్పాలతో అలంకరణ, మాతేశ్వరీలకు ప్రత్యేక అలంకరణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం నుంచి జియాగూడలోని 58 బస్తీల బోనాలు సమర్పించేందుకు మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఆలయానికి వస్తారన్నారు. 250 ఏళ్ల నుంచి జియాగూడ గ్రామ దేవతకు తొలి బోనం సమర్పించడం ఆనవాయితిగా వస్తుందన్నారు.

మాస శివరాత్రిని పురస్కరించుకొని శివలింగానికి ఆలయ పూజారులు రాంమూర్తి శాస్త్రి, శ్రీనుల ఆధ్వర్యంలో విశేష అలంకరణ, హారతి, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – డబీర్‌పురా



'సెయింట్ జాన్ అంబులెన్స్' ఉచిత వైద్య శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: బోనాల పండగ నేపథ్యంలో ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు కోఠి డీఎం అండ్ హెచ్ఎస్ క్యాంపస్ లోని సెయింట్ జాన్ అంబులెన్స్ సర్వీస్ సెక్రటరీ డాక్టర్ ఎం.మహేంద్ర కుమార్, డైరెక్టర్ వి.వి.వి.ఎస్.మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురికి ఉచిత వైద్య సేవలు అందించామని.. గాయపడినవారికి తక్షణమే చికిత్స చేశామని వెల్లడించారు. డాక్టర్ నీరజా లక్ష్మి, సీనియర్ అధ్యాపకులు మోహ్సిన్, రాజ్ కుమార్ సింగ్ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించినట్లు వివరించారు. బోనాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఈ శిబిరం నిర్వహించామని పేర్కొన్నారు.

ఉజ్జయిని మహంకాళికి బంగారు బోనం సమర్పణ


ఉజ్జయిని మహంకాళికి బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: అమ్మవార్ల కటాక్షంతోనే తెలంగాణ సస్యశ్యామలంగా ఉందని పోతూలూరి వీరబ్రహ్మేంద్ర సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్ అన్నారు. ఆదివారం ఆయన సమితి తరఫున ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బంగారు బోనం, పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అమ్మవార్లకు తాము ప్రతియేటా పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పిస్తున్నామన్నారు. సమితి సలహాదారులు, జగదాంబిక మహంకాళి ఆలయ వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, వాణిశ్రీ, శివచారి, సురేష్‌చారి తదితరులున్నారు.



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాట జైన్‌బాబును ఎన్నుకున్నామని ఔట్ సోర్సింగ్ కమిటీ మెంబర్ మహ్మద్ హఫీజ్ తెలిపారు. ఈ సందర్భంగా హఫీజ్ మాట్లాడుతూ..ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న వారికి న్యాయం జరుగుతుందన్నారు. వాళ్లకు అందాల్సిన బెనిఫిట్స్ అందుతాయ పేర్కొన్నారు. – శాలిబండ

బోనం.. సంబురం

గోల్కొండ కోటలో ఘనంగా బోనాల 6వ పూజ


మహంకాళి అమ్మవారికి పూజలు


కోటలో భక్తుల సందడి

- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు
- గోల్కొండ పరిసర ప్రాంతాల నుంచి అమ్మవార్లకు తొట్టెల సమర్పణ

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి 6వ పూజ సందర్భంగా భక్తులతో గోల్కొండ కోట కిటకిటలాడింది. అక్కన్న మాదన్న కార్యాలయం, నగీనా బ్యారెక్స్, రాణిమహల్ ప్రాంతాల్లో మహిళలు బోనం కుండలను సంప్రదాయ రీతిలో అలంకరించారు. మరికొందరు మహిళలు నైవేద్యం తయారు చేసి నాగదేవత పుట్టకు సమర్పించారు. ఫతేదర్వాజా నుంచి డప్పు వాయిద్యాలతో భక్తులు తొట్టెలను ఊరేగింపుగా కోట చౌరస్తా వద్దకు తెచ్చారు. మరో వైపు బంజారి దర్వాజా నుంచి స్థానిక నాయకుడు బాబురావు ఆధ్వర్యంలో పోతరాజులు విన్యాసాలు చేస్తుండగా తొట్టెలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ ఊరేగింపు బంజారి దర్వాజా నుంచి రిసాలబజార్, గోల్కొండ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల మీదుగా గోల్కొండ కోట చౌరస్తాకు చేరుకుంది. సంఘ సేవకుడు ఎస్.రాజువస్తాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తొట్టెల ఊరేగింపు జరిగింది.


రాజు వస్తాద్ ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు

వివిధ బస్తీల నుంచి..

6వ పూజను పురస్కరించుకొని వివిధ బస్తీల వారు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. బంజారి దర్వాజా, మోతీదర్వాజా, రాందేవ్‌గూడ, కుమ్మర్‌వాడీ, మహిళా గంజ్, అల్కాపూర్ తదితర ప్రాంతాల నుంచి స్థానిక బస్తీ కమిటీల ఆధ్వర్యంలో బాజాభజంత్రీలతో అమ్మవార్ల తొట్టెల ఊరేగింపు జరిగింది.

పోలీసుల భారీ బందోబస్తు..

పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో టోలిచౌకి డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ బందోబస్తును పర్యవేక్షించారు. కోటలోని రాణిమహల్, బాలాహిస్సార్ గేటు, నాగదేవత పుట్ట తదితర ప్రాంతాల్లో మహిళా పోలీసులను నియమించారు. కాగా కార్వాన్ క్లస్టర్ మెడికల్ ఆఫీసర్ మురళీధర్ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. జలమండలి అధికారులు భక్తుల కోసం ఫతేదర్వాజా నుంచి గోల్కొండ కోట వరకు ఉచిత తాగునీటిని అందించడానికి ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేశారు.


బంజారి దర్వాజా నుంచి అమ్మవారి ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు